

# అపవాదు

ఎ.సువర్ణ

వేగంగా పరిగెడుతున్నాడు ఏకలవ్య. వెనక నుంచి తరుముకొచ్చేవాళ్ల చేతుల్లో చిక్కకూడదని వేగంగా పరుగెత్తుతున్న ఏకలవ్యకి కాలికి రాయి తగిలింది. ఒక్క ఉదుటున ఇసుకలో పడ్డాడు. అలా పడిన అతనికి ఇసుకలో ఏదో కనిపించింది. అదేమిటోనని బయటికి తీశాడు. ధగధగా మెరుస్తున్న బంగారు గొలుసు అది. కళ్లు పెద్దవి చేసి దానివంక చూశాడు. ఇంతలో స్నేహితులందరూ బిలబిలమంటూ ఏకలవ్యని చుట్టుముట్టారు.

"అదిగో చూడండి. నేను చెప్పింది అబద్ధమేమో. ఆడపిల్ల మెళ్లో వేసుకునే గొలుసు వాడి చేతుల్లో మెరుస్తోంది" అన్నాడు వాళ్లలో ఒకడు.

"ఇప్పుడైనా చెప్పరా. నీ ప్రియురాలెవరైందీ చెప్పు! విని మేమూ సంతోషపడతాము" ఇంకొకడు అడిగాడు.

"చాల్లేండిరా, ఆపండి మీ అధిక ప్రసంగం. నేను కాలేజికి వచ్చేది చదువుకునేందుకురా. ప్రేమించడానికి కాదు! నిజంగా నాకీ గొలుసు ఎవరిదైందీ తెలీదర్రా. మీరు నన్ను పట్టుకోకూడదని పరుగెత్తుకొస్తుంటే ఇసుకలో పడ్డప్పుడు నా చేతుల్లోకి ఈ గొలుసు వచ్చింది!" అన్నాడు ఏకలవ్య.

"కొయ్...కొయ్యో... లేత సొరకాయలు బాగానే కోస్తున్నాడు అబ్బాయి" మరొకడు అన్నాడు.

"సాయంత్రం మేమంతా ఇక్కడే, ఈ ఇసుకలోనే ఆడుకున్నాం. మాకెవరికీ దొరకని గొలుసు నీకు దొరికిందంటే నమ్మడానికి మేమేమీ ఫూల్స్‌ము కాము" మరొకడి కామెంట్.

"మీరెవరూ నాకు మల్లే ఇట్లా పడిపోయి చేతులు ఇసుకలోకి పోలేదుగా. అందుకే మీ కెవరికీ దొరకలేదు" వాళ్ల కామెంట్ నిజం కాదని వివరించాడు ఏకలవ్య.

"పరిగెత్తాముగా. ఎవరి కాళ్లకైనా తగిలి ఉండచ్చుగా" అని ప్రతి ఒకడూ వాళ్లు ఊహించినట్టుగా ఏకలవ్యకు ఒక ప్రియురాలుందని నిర్ధారణ చేశారు.

"ఆ....ఆ.... తెలిసిందిరా! ఏకలవ్య 'లవ్వరు' ఎవరైందీ తెలిసిపోయిందిరా" అని ఏదో కొత్తగా కనిపెట్టినట్టు 'యురేకా' అని అరచి "రాధరా! ఈ గొలుసు రాధదిరా. విరిగిపోయినట్లుంది. అతుకుపెట్టి తెమ్మని ప్రియునికిచ్చినట్లున్నది."

ఆ మాట వినగానే ఏకలవ్య ఒక్క క్షణం ఆలస్యం చేయలేదు. స్నేహితులందరిని తోసుకుని బయటకు వచ్చి సైకిలు తీసుకుని అడ్డదారమ్మట వేగంగా తొక్కుకుంటూ వస్తున్నాడు ఏకలవ్య.

పది నిముషాలలోనే గట్టుమీద నడిచి వెడుతున్న రాధను చూశాడు. "రాధగారూ!" అని పిలుస్తుండగానే సైకిల్ చైన్ తెగి సైకిల్‌తో సహా గట్టుపక్కనున్న కాలువలో పడిపోయాడు ఏకలవ్య.

మొదట పిలుపు, తర్వాత మనిషి కాలువలో ధబ్బున పడడం విని పించి రాధ వెనక్కు తిరిగింది.

"అరెరే, ఏకలవ్యా! కాలువలో ఎట్లా పడ్డావు?" అని రాధ వెనక్కి వచ్చి ఏకలవ్య పైకి రావడానికి చెయ్యి అందించింది.

ఏకలవ్య రాధా అని పిలిచి కాలువలో పడడం, రాధ అతనికి చెయ్యి అందించడం రెండు కళ్లు చూశాయి. ఏకలవ్య రాధ చెయ్యి పట్టుకోకుండా పైకి వచ్చి రాధకు "థాంక్స్" అని చెప్పడం చూడలేదు.

"రాధా! ఈ గొలుసు నీదేనా?" ఏకలవ్య జేబులోంచి గొలుసు తీసి చూపిస్తూ అడిగాడు. ఆ గొలుసు చూసిన రాధ మొహంలో హండ్రెడ్ వాట్స్ బల్బు కాంతి వచ్చింది.

"ఆఁ! అవును ఏకలవ్యా! నాదే. పొద్దున షటిల్ ఆడుతుండగా ఇసుకలో పడిపోయింది. ఆడాక చూసుకుంటే మెడలో గొలుసు లేదు. పరిగెత్తుతూ ఇంతమంది ఆడుతుండగా గొలుసు ఎక్కడో ఇసుకలో కూరుకుపోయిందల్లే ఉంది. ఎంత వెతికినా కనిపించలేదు. రెండు తులాల బంగారం పోగొట్టుకున్నాననే బాధ ఒకవైపు, ఇంట్లో అమ్మ, నాన్న తిడతారనే భయం ఇంకోపక్క. ఇప్పుడే...అందుకే ఇంత ఆలస్యంగా చీకటి పడుతుండగా ఇంటికి వెడుతున్నాను." అన్న రాధ ఏకలవ్య ఇచ్చిన గొలుసు తీసుకుని మెడలో వేసుకోవడం మరో జత కళ్లు చూశాయి.

"దేముడే నీ చేతికిచ్చిట్లున్నాడు. ఇంకెవరికైనా దొరికితే మళ్లీ నాకు దొరికేది కాదు. థాంక్స్!" చెప్పి రాధ వెళ్లిపోయింది.

కాలువలోంచి సైకిలు పైకితీసి చిందరవందరగా పడున్న పుస్తకాలు, టిఫిన్ బాక్స్ తీసి సైకిల్

వెనక కారియర్‌లో పెట్టుకుని సైకిల్ తోసుకుంటూ ఇంటిదారి పట్టాడు ఏకలవ్య.

★ ★ ★

"ఏమిట్రా, పాములూ! నువ్వనేది నిజమేనా!" ఉయ్యాల బల్ల మీద కూర్చుని ఊగుతూ అడిగారు సోమయాజులు.

"నిజమేనండి దొరగారూ! ఆ ఏడుకొండలవాడి మీద సాక్షిగా సత్తె ప్రమాణంగా నిజమేనండి."

"నువ్వు కళ్లారా చూశావురా....?" సోమరాజులు అడిగారు.

"నమ్మకమైన చూసిన కళ్లు చెప్పినయ్యండి..."

ఆ కళ్ళు చూసినదేమిటో మళ్ళీ చెప్పరా....... పాములూ....'

"అదేనండీ.... రాధమ్మగారు...... ఆ వందనం గాడి కొడుకు ఏకలవ్య ప్రేమించుకున్నారు...... చేలంట..... గట్లంబడి చెట్టాపట్టాలేసుకుని వూసులాడుకుంటున్నారు.... పాటలు పాడుకుంటున్నారు...... లగ్గం చేసుకుందామనుకుంటున్నారు........ అని పాలేరు పాములు చెప్పగానే సోమయాజులుకి దుర్వాసుడుకి వచ్చినంత కోపం వచ్చింది.

"హూ......." అని హూంకరించి కోపాన్నంతా కూర్చున్న ఉయ్యాల బల్లమీద చూపిస్తూ కాళ్లు రెండు నేల మీద ఆనించి గట్టిగా తోస్తూ వూగుతున్నాడు సోమయాజులు.

సోమయాజులు వేదాలు ఉపనిషత్తులు పుక్కిట పట్టిన బ్రాహ్మణోత్తముడు. యజ్ఞంచేసి సార్థక నామధేయుడనిపించుకున్నాడు.

"కుటుంబమంతా నిప్పుకడిగేంత ఆచారవంతులు. అల్లాంటి బ్రాహ్మణులింట పుట్టిన తన కూతురు తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకోవడమా!...... వందనం గాడికి తను వియ్యంకుడవడమా.... ఛీ....... ఛీ....... అనుకున్న సోమయాజులు ఒంటి మీద గొంగళిపురుగులు పాకుతున్నట్లుగ అనిపించింది.

'వెనకబడిన వాళ్లకి చేయూతనిచ్చి ఎన్నో రాయితీలు ఇచ్చి వాళ్లను పైకి తీసుకురావాలనేదే నా కోరిక..... అందుకు నేను వాళ్లకి పుస్తకాలు కొనిచ్చి, పీజులు కట్టి సహాయపడుతున్నాను..... వేద పాఠశాలలో చేర్చుకుని అందరితో సమంగా కూర్చోపెట్టుకుని వేదం చెప్పడానికి

రైలు ఏదో స్టేషన్లో ఆగింది. పక్కన కూర్చున్న వ్యక్తి సుబ్బారావు భుజం మీద చేయివేస్తూ...
'ఇది ఏ స్టేషనండి?' అని అడిగాడు.
'ఇది స్టేషను కాదు నా భుజమండి'' విసుక్కుంటూ చెప్పాడు సుబ్బారావు.
— అబ్దుల్‌గఫూర్. మోర్తాడ్



తనకెంత మాత్రం అభ్యంతరం లేదు.

'కానీ...... కానీ....... వాళ్లతో వియ్యమందడానికి తను సుతరాం ఒప్పుకోడు........ నీచు మాంసం తినే వాళ్లతో సంబంధం కలుపుకోవడాలు తనకెంత మాత్రం ఇష్టం లేదు.......

ఆయన కోపం అంతా చూపిస్తూ..... వుసేయ్..... సోమిదేవమ్మా నీ కూతురు చేసిన నిర్వాకం విన్నావుటే..... ఏది దాన్నిపిలు..... అంటూ వంటింట్లోకి చూస్తూ అరిచారు సోమయాజులు.

తల్లీకూతుళ్లిద్దరూ భయపడుతూ వచ్చారు....

"ఇంత వరకూ ఈ ఇంటి పుట్టిన ఆడబడుచులెవరూ కాలేజీ మొహం చూసిందిలేదు...... ఆధునిక భావాలు కలవాడిని కనకే నిన్ను కాలేజీలో చేర్పించాను.... కానీ నువ్వు చేస్తున్న దేమిటి.... ఆ వెధవతో ప్రేమ కలాపాలు సాగిస్తావా......" అని కూతురు వైపు చూస్తూ కోపంగా అడిగాడు తండ్రి.

"రేపటి నుంచీ నువ్వు కాలేజీకి వెళ్లద్దు....." అని ఆర్డరు చేశాడు. అప్పుడు నోరు విప్పింది రాధ.

"నేనేమిటి ఏకలవ్యని ప్రేమించడం ఏమిటి!?!.... నేను ప్రేమించటం లేదని ఎంత చెప్పినా నా మీద మీకు నమ్మకం లేదా..... మీ కూతురు మీద మీకు నమ్మకం లేదా నాన్నా......." కన్నీళ్లతో తండ్రినడిగింది రాధ.

"ఇలాంటి విషయాల్లో సంబంధించిన వాళ్ళెప్పుడూ చెప్పరు.... చూసిన వాళ్ళు చెప్పింది నమ్మి తీరాలి......

ఇంకపైన తండ్రిని నమ్మించడం ఆ బ్రహ్మతరం కూడా కాదని మౌనంగా లోపలికెళ్లిపోయింది రాధ.

★ ★ ★

"ఏంరా ఏకూ, నేవిన్నది నిజమేరా....." అడిగాడు తండ్రి కొడుకుని.

"నువ్వేం విన్నావో చెప్పండే అది నిజమొ....... అపద్ధమొ ఎట్లా చెప్పేది అయ్యా...... అయ్యని అడిగాడు ఏకలవ్య.

"వూరంతా కోడై కారుకూతలు కూస్తుంటే నీకు వినపడలేదంట్రా...... వందనం గాడు కొడుకుని అడిగాడు.

"వూళ్లోవి వినిపిస్తున యయ్యా....... ఇంట్లో ఏం అనుకునేదే నాకు వినపడ్డం లేదయ్యా...."

"మీ అమ్మ నిన్ను కని నా చేతుల్లో పెట్టి వీడిని బాగా చదివించు నీకు మల్లే పాకీ పనులకి పంపద్దు. అని చెప్పి ఆ భగవంతుడి దగ్గరకు వెళ్లిపోయిందిరా..... మీ అమ్మకిచ్చిన మాట ప్రకారం నిన్ను చదివిస్తున్నాను.

"అది ఎట్లా..... ప్రభుత్వం వాళ్ళు వెనకపడిన తరగతులాళ్ళకిచిన రియాయితీలేవీ తీసుకోకుండా నా కష్టార్జితంతో చదివిస్తున్నానురా......నువ్వు బాగా చదివి కలెక్టరువవుతావని ఆశలు పెట్టుకున్నానురా...... నువ్వా అమ్మాయి ఎనక్కాల పడి........"

"చాలు ఆపయ్యా..... నే నేపిల్లల ఎనక తిరగడం లేదు.... శుభ్రంగా, చదువుకుంటున్నాను..... స్టేట్ లేవల్లోనే ఫష్టున పాసయ్యాను..... నీ ఆశలు నేను తప్పకుండా నెరవేరుస్తానయ్యా....

"అనవసరంగా ఆళ్ళు..... ఈళ్ళు చెప్పిన మాటలు నమ్మి మనసు పాడుచేసుకోకయ్యా....." అని తండ్రికి చెప్పాడు కొడుకు.

అంతలో వాకిట్లో ఏదో కలకలం, నలుగురు మనష్యులు గట్టిగా మాట్లాడుకోడం వినిపించి తండ్రీకొడుకులిద్దరూ బయటి కొచ్చారు.

గుంపుగా పదిహేను ఇరవై మందిని వాకిట చూశారు. వాళ్ల లోంచి ఒకడు ... వందనం మావా రచ్చబండ దగ్గరకు రాండి ఇద్దరు ... అన్నాడు. ఎందుకన్నట్లు చూశాడు వందనంగాడు.

... నీ కొడుకు పెద్దింటి పిల్లను లగ్గం చేసుకుంటాడని, వాళ్ళంత మన మీద కారాలు మిరియాలు నూరుతున్నారు .. ...

మీరంటే మీరని చిలికి చిలికి గాలి వాన చేశారు అంతా. పాత పగలు కొంతమందిలోను, కుల మత ద్వేషాలు కొంతమంది మనస్సులలో పెట్టుకుని చిన్న వదంతిని అడ్డం పెట్టుకుని ఒకరి మీద ఒకరు బురద చల్లుకున్నారు ... తిట్టుకున్నారు ... కొట్టుకున్నారు ... పొడుచుకున్నారు ... నరుక్కున్నారు .. వాళ్లలోని మనుష్యత్వం మాయం అయి రాక్షసత్వం చోటుచేసుకుని, వికటాట్టహాసం చేసింది. మనుష్యత్వం మాయం అయిన మనుష్యులలో బుద్ధి, విచక్షణాజ్ఞానం నశించింది.

ఆ మారణకాండ ఆ వూరితో ఆగలేదు ... చుట్టు ప్రక్కల గ్రామాలకి అంటు వ్యాధిలా సోకింది. పోలీసుల వల్ల కాక ఆర్మీ రావలసి వచ్చింది. హింసాకాండని అదుపులోకి తీసుకొచ్చేందుకు నిరవధిక కర్ఫ్యూ విధించారు అన్నిచోట్లా ... స్కూళ్లు కాలేజీలు మూసేశారు.

కక్షలు, కార్పణ్యాలకి బలైపోయేది పసివాళ్ల చదువులు.

రాధ ఏకలవ్య జరిగిన ఈ ఘోరాలకన్నింటికీ తామే కారణం అని కుమిలిపోయారు.

ఏ తప్పు చెయ్యని వాళ్లనడ్డు పెట్టుకుని ఇన్ని దారుణాలు చేసిన వాళ్లెవరు ... అభూత కల్పనలకి ఇన్ని హత్యలు చేయించకలిగే శక్తా ... ... నిజం కంటే అబద్ధాలకే శక్తి ఎక్కువ ... వదంతులనే జనం ఎక్కువగా నమ్ముతారు అనుకుని బాధపడిపోయాడు ఏకలవ్య.

వదంతులు దావానలం వంటిది ... అడవిలో ఒక చెట్టుకు నిప్పు అంటుకుందంటే పక్కనున్న ఒక్కొక్క చెట్టుకీ ఆ నిప్పు అంటుకుని అడవంతా భగ్గుమంటుంది. అట్లాగే ఆ ఏకలవ్య నాకు ఉపకారం చెయ్యబోయి లేనిపోని బాధలకు తను గురికావడం కాదని ఇంతదమనకాండకి కారణం అయ్యాడు ... రాధ ఎన్ని రకాలుగానో అనుకుని బాధపడింది.

కాల ప్రవాహంలో ఎన్నోమార్పులు. రాదకి పెళ్లి అయి అత్తారిం

టికి వెళ్లిపోయింది. ఏకలవ్య పట్టుదలగా చదివి ఐ.ఎ.ఎస్. పాసై నార్త్‌లో కలెక్టర్‌గా అపాయింట్ అయ్యాడు .. పాతిక సంవత్సరాలు కాల ప్రవాహంలో కొట్టుకుపోయినయ్యి. కానీ చుండూరు గ్రామంలో కుల కక్షలు రావణాసురుని కాష్టంలా తగలబడుతూనే వున్నయ్యి.

సంవత్సరానికోసారైనా నివురు కప్పిన నిప్పులా వున్న మనుష్యుల మనస్సులలోని పగలు పైకి వచ్చి గ్రామం భగ్గుమంటూనే వుంది.

* * *

ఆ రోజు దినపత్రికలో 'ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం చుండూరులో కులద్వేషాలకి ఇద్దరు బలి, రెండు గడ్డివాములు దగ్ధం' అన్న వార్త చదివాడు రవి.

ప్రతీ సంవత్సరమా ... అని మనస్సులో ఆశ్చర్యపోయాడు రవి.

అసలీ కులద్వేషాలకి కారణాలేమిటో స్వయంగా వెళ్లి తెలుసుకురావాలనుకుని రవి వెంటనే చుండూరుకి బస్సులో బయలుదేరాడు.

దారిలో కనిపించిన ఒకరిద్దరిని పలుకరించాడు రవి. వాళ్లెవరూ రవికి సమాధానం కూడా చెప్పకుండా వెళ్లిపోయారు. వాళ్లందరి మొహాలు మండే సూర్యగోళాలులా వున్నాయి.

"సార్ ఇంత చిన్న గ్రామంలో ఇంత మారణహోమానికి కారణం ఏమిటి ... ఎన్ని సంవత్సరాల నుంచీ ఈ ఘోరాలు జరుగుతున్న"య్యని కాస్త పెద్దమనిషిలా కనిపిస్తున్నాయననని అడిగాడు రవి.

"నాకూ అసలు సరిగ్గా తెలీదు.

"అదుగో చూడండి కనిపిస్తున్నదే శివాలయం ... ఆ గుడి పూజారిగార్కి అన్నీ తెలుసును ... వెళ్లి ఆయనని అడగండి సార్ ... అని చెప్పి వెళ్లిపోయాడా పెద్దమనిషి.


రవి గుడి ఆవరణలోకి వచ్చిన భయభక్తులతో చెప్పులు బయట వదలి బావి దగ్గరకొచ్చి బావిలోంచి నీళ్లు తోడి కాళ్లు చేతులు కడుక్కొని లోపలికొచ్చాడు.

పూజారి హారతి వెలిగించి స్వామికి చూపించి రవి దగ్గరకు తీసుకొచ్చాడు. రవి భక్తి శ్రద్ధలతో కళ్లకద్దుకుని పళ్లెంలో పదిరూపాయలు నోటువేశాడు. పూజారికి సంతోషంతోపాటు ఆశ్చర్యమనిపించింది.

కొత్తగా ప్రేమిస్తున్న కూర్మారావ్ తన ప్రేయసి 'గౌరి' కళ్ళలోకి తదేకంగా చూస్తూ...

'గౌరి: ఏంటే 'కూర్మం' ఏం కనిపిస్తుంది నా కళ్ళలో?

కూర్మారావ్: ఒక కంట్లో 'లక్ష్మి', రెండో కంట్లో 'లక్ష'. కళ్ళలోకి చూస్తూనే తడుముకోకుండా సమాధానం ఇచ్చాడు కూర్మం.



గౌరి: ...????...?

— వడాల గోపీకృష్ణ, జమ్మూరు

తీర్థప్రసాదాలిచ్చి శటగోపురం పెట్టిన పూజారి రవిని... మనదేవూ రండీ బాబూ.... అని అడిగాడు హారతి పళ్లెంలోని పది రూపాయల నోటు రొంటిన దోపుకుని.

"ఈవూరు కాదనుకుంటాను..." అని పూజారే మళ్లీ అడిగాడు.

"అవును స్వామీ.... మీరు నాకో సమాచారం చెప్పాలి... రండి అట్లా కూర్చుని మాట్లాడుకుందాము..." అన్నాడు రవి.

ఇద్దరూ గుడి ఆవరణలోని వేప చెట్టు కింద ఉన్న అరుగు మీద కూర్చున్నారు.

"స్వామీ తమరికి అరవై ఏళ్లు ఉండవచ్చును.... ఇరవై... పాతిక సంవత్సరాల కింద జరిగిన సంఘటనలన్నీ... అంటే ఈ వూళ్లో జరిగినవి మీకు బాగా గుర్తుండవచ్చును."

"నేనో పాత్రికేయుణ్ణి... వార్తలు రాస్తూంటాను... ఈ గ్రామంలో ప్రతీ సంవత్సరం జరిగే ఈ మారణ హోమానికి అసలు నిజమైన కారణం మీరు నాకు చెప్పాలి... మీ ఫోటో పేపర్లో వేయిస్తాను..." అని పూజారికి రవి ఆశ చూపించాడు.

"నాకప్పుడు ఇరవై ఆరు... ఏడు... సంవత్సరాలు ఉంటయ్యి. మా నాన్నే ఇంకా గుడి అర్చకులుగా ఉన్నారు....

"చాలామంది జరిగిన దానికి ముక్కులు చెవులు పెట్టి ఉన్నవి లేనివి కల్పించి చెప్తారు... నేను మాత్రం అట్లా కాదండీ... జరిగింది జరిగినట్టు, ఉన్నది ఉన్నట్లు చెప్తాను...."

"అందుకే సరాసరి మీ దగ్గరకొచ్చాను.... ఏదిముందు మిమ్మల్ని ఫోటో తీస్తాను..." అని రవి భుజానికి తగిలించుకున్న సంచీలోంచి హాట్‌షాట్ కెమెరా తీసి ఆయన ఫోటో తీశాడు. పూజారికి మరీ ఖుషీ అయిపోయింది. దాంతో ఆయనలో ఊహలు ఎక్కువైనాయి.

"యజ్ఞయాగాదులు చేసిన సోమయాజులుగారి కూతురు రాధ వందనంగాడి కొడుకు ఏకలవ్య కలిసి కాలేజీలో చదువుకుంటున్నారు.... కొన్నాళ్లకి వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు... పెళ్లి కూడా చేసుకుందామనుకున్నారు.

"రాధ నాన్నగార్కి తెలిసి రహస్యంగా నాతో పెళ్లి జరిపించాలనుకున్నారు... కానీ రాధ ఏకలవ్య ఒక రోజు రాత్రి విజయవాడ వెళ్లిపోయారు. కనకదుర్గ కొండ మీద పెళ్లి చేసుకోవాలనుకుంటున్నవాళ్లను సోమయాజులుగారు పట్టితీసుకొచ్చారు... రాధని కాలేజీ మానిపించేశారు. ఏకలవ్యని చెట్టుకి కట్టేసి గొడ్డుని బాదినట్లు బాదారు... అది చూసి మాలమాదిగలంతా బ్రాహ్మణుల ఇళ్లకి నిప్పంటించారు.... గడ్డివాములు తగలబెట్టారు.

"అట్లా అప్పుడంటుకున్న ఆ నిప్పు ఇప్పటికీ చల్లారకుండా అప్పుడప్పుడు అంటుకుంటూనే ఉంది..." అని పూజారి చెప్పినవన్నీ రాసుకుని తిరిగి వచ్చాడు రవి.

గోడ గడియారంలో పది గంటలు కొట్టింది.

హఠాత్తుగా మెలుకువ వచ్చిన రాధమ్మ కొడుకు గదిలో ఇంకా లైటు వెలుగుతూండడం చూసి పరీక్షలైపోయినా వీడింత రాత్రివరకూ మేలుకుని ఏం చేస్తున్నాడబ్బా..." అనుకుంటూ లేచి రవి గదిలోకి వచ్చింది.

టేబులు ముందు కూర్చుని ఏదో రాస్తున్న కొడుకుని చూస్తూ "నాయినా రవీ ఏమిట్రా ఇంత పొద్దుపోయినా ఇంకా ఏమిటి రాస్తున్నావు" అని అడిగింది. తల్లి ప్రశ్న విని కలం మూసి టేబులు మీద పెట్టాడు రవి.

"అమ్మా పాతిక సంవత్సరాల కింద ప్రారంభం అయి ఇంకా ఇప్పటికి కుల మత కక్షలతో చంపుకునేందుకు నిజమైన కారణం తెలుసుకొచ్చాను. ఆ వూరు వెళ్లి... ఆ ఆర్టికల్ రాసి రేపు ఓ పెద్ద ఇంగ్లీషు పక్ష పత్రికకు పంపిస్తానమ్మా..." అన్నాడు రవి.

"ఏ ఊరురా అది...?" అడిగింది తల్లి.

"చుండూరు..." ఆ పేరు వినేసరికి ఉలిక్కిపడింది రాధమ్మ.

"నిజమైన ఆ సంఘటన ఏమిటని చెప్పారురా..." అని అడిగింది.

రవి తను చుండూరు వెళ్లిరావడం పూజారి చెప్పిన విషయాలన్నీ చెప్పి "ఇదిగో చూడమ్మా ఈయనే ఈ ఫోటోలో ఉన్నాయనే తను కళ్లారా చూసిన విషయాలని చెప్పాడు..." అని చూపించిన ఫోటోలోని పూజారిని చూసి వీడా నీకు చెప్పింది నాయనా... ముందా రాసిన కాగితాలన్నీ చించిపారెయ్యి? అంది తల్లి.

ఆశ్చర్యంగా చూస్తూ ఎందుకమ్మా అని అడిగాడు రవి. "ఆ నిజమైన విషయాలు నేను చెబుతానురా... ఆ పూజారి చెప్పినదంతా కట్టుకథే..."

"అమ్మా నీ కా విషయాలు ఎట్లా తెలుసును...?"

"మీ అమ్మమ్మగారి ఊరు చుండూరని నీకు తెలీదు... నేను ఎప్పుడూ నీకు చెప్పలేదు" అన్న రాధమ్మ కొడుక్కి జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్లుగా చెప్పింది.

"ఇంత వివరంగా నీకెట్లా తెలుసమ్మా....?"

"ఆ జరిగిన సంఘటనలోని రాధను నేనేరా. నువ్వు రాసేది ఇంగ్లీషు పత్రిక్కి... ఉత్తర దేశంలో ఉన్న ఏకలవ్య చదువుతాడు. ఈ అభూత కల్పనలు నా కొడుకు రాశాడని మహాబాధపడతాడు.."

"అమ్మా నువ్వెప్పుడూ నాకీ విషయాలు చెప్పనేలేదు ఎందుకని..."

"ఇవేం గొప్ప విషయాలు... అది కాక అనవసర విషయాలు చెప్పడం నాకెప్పుడూ అలవాటులేదు.

"ఇప్పుడైనా నువ్వా వదంతులను నమ్మి పేపర్లకి రాసి ప్రజలలో అబద్ధపు నమ్మకాలు కలిగించకూడదనే చెప్పాను... లేదంటే ఆ సంఘటన నాలోనే సమాధి అయిపోయేది.

అంతవరకూ రాసినదంతా చించి పారేసి అపవాదులోని నిజం అన్న దానిమీద ఆర్టికల్ రాయడానికి కలం చేతిలోకి తీసుకున్నాడు రవి.